# మరో తెల్గీ!

పోలీసు వుద్యోగంలో వుండే 'మజా'నే వేరు! ఎంతటి వాడినైనా లాఠీతో బాదేయచ్చు. బొక్కలో త్రోసేయచ్చు! కసి తీర్చుకోవచ్చు! పతకాలు కొట్టేయచ్చు! రికమెండేషన్ కల వారినైతే సారీ చెప్పి వదిలేయచ్చు! లేకుంటే ఎన్‌కౌంటర్లో చంపేయచ్చు!

పోలీసులకు సెంటిమెంట్లు... స్వపర బేధాలుండవు! వారికిచ్చే ట్రైనింగ్ అలాంటిది!

ట్రాఫిక్ పోలీసుల వుద్యోగమంటే మరీ గొప్ప! డ్యూటీ సమయాల్లో ఎండకు ఎండి వానకు తడిసినా.. రాంగ్ రూట్‌లో వచ్చాడనో... లైసెన్స్ వెంటలేదనో.. చలాన్ చేయచ్చు! డబ్బులు గుంజచ్చు! అందులో కొంత ఆఫీషియల్... మరి కొంత సొంతం!

హార్డ్ డూటీస్ అయినా... కష్టే ఫలే కదా! మరి పైసలెట్లా వస్తయ్! అంతా 'రుబాబే'! దబాయింపు సెక్షణ్!

డిపార్టుమెంట్లో చోటు దొరికితే చాలని కలలు కనే వారనేకులు! తిండి... కండ... పర్సనాలిటీ కల వాళ్లకే ఒకప్పుడు డిపార్ట్‌మెంట్‌లో చోటు!

ఇప్పుడదేం లేదు. ఒక్కపీనుగైనా... మెల్ల కంటి వాడైనా.... సొట్ట బుగ్గల వాడైనా ఈజీగా సెలక్టయి పోగలడు. రోజులు మారినయ్ కదా?... ఆ చదువు ఈ చదువు అనే బేధ భావం లేకుండా వుద్యోగం దొరికితే చాలనుకుని... ఎం.బి.ఏలు... ఇంజనీర్లు... డాక్టర్లు సైతం ఏదో ఒక పోస్టులో చేరిపోతున్నారు. నిరుద్యోగ సమస్యను అధిగమించాలంటే ఇదే రహదారి!.

ఫ్రీ యూనిఫారం, ఫ్రీ బూట్లు... ఫ్రీ లాఠీ... ఫ్రీ టోపీ.. తోపుడు బండ్ల వాళ్ల దగ్గర 'ఫ్రూట్స్' వగైరా ఫ్రీ... మార్కెట్లో కోళ్లు గుడ్లు కూరగాయలు ఫ్రీ! పవర్ఫుల్ డిపార్ట్‌మెంట్ కదా? అన్నీ ఫ్రీయే!

బేరసారాలకు ఆడమగ అనే వ్యత్యాసం వుండదు డిపార్టుమెంట్లో. బండ బూతులు తిట్టటంలో టాపర్స్! పై వాళ్లని మేపాలనే సాకుతో వచ్చినంత వరకు రోజూకుమ్ముడే! ఆడేవన్నీ అబద్ధాలే! సర్వీసులో వుండగ ఒక్క నిజం మాట్లాడితే ఒట్టు!- కాదు కాదు... అమ్మతోడే!

ఇదంతా ఓపెన్ సీక్రెట్టే... ఈ సబ్జక్ట్ మీద సినిమాలు... టీ.వి సీరియళ్లు

కోకొల్లలు! కథలూ పుంఖానుపుంఖాలుగా వచ్చినయ్! అయినా దేనికదే కొత్త!

నీరుపల్ల మెరుగు నిజం దేవుడెరుగు అనే థియరీని బట్టి చూస్తే లంచగొండితనం టాప్-టు-బాటమ్'... ఆర్... 'బాటమ్-టు-టాపా?' అనే ఈ ప్రశ్నకు జవాబు కష్టమే!

నాకు వక్కడే కొడుకు! కాలు కింద పెట్టనీయకుండా గారాబంగ అల్లారు ముద్దుగా పెంచాను! వాడు పుట్టే నాటికి నేను ఎస్సై!

బ్రిటీష్ కాలంలో మా 'గ్రాండ్‌పా' దొరల కాళ్లుపట్టి... మస్కాకొట్టి... సబ్ ఇన్స్పెక్టర్ వుద్యోగం సంపాదించి... బోలెడంత ఆర్జించాడు. దొరల సరసన కూర్చుని మందుకొట్ట గలిగే స్టేటస్ సంపాదించాడు. తాతగారి బుర్ర మీసాలు... పహిల్వాన్ లాంటి కండలు తిరిగిన శరీరం చూచి తెల్ల దొరలు ముచ్చట పడి 'జాబ్' ఇచ్చారట!.

మా డాడీకీ తాతగారి పోలికే! ఆ రోజుల్లో బి.ఎ.గోల్డ్ మెడలిస్ట్ అయినందున ఎస్సై పోస్టుకు సెలక్షనొచ్చింది. ఎస్పీగా చేసి రిటైరైనాడు.

అనువంశక పాలనలాగ... నేను పి.జి చేసినా పోలీసు వాసన నన్నొదల్లేదు. దోస్తులు బంధువుల వత్తిడి చేస్తే... ఎస్సైపోస్టుకి సెలక్టయ్యాను. ఐ.పి.ఎస్ కావాలని కన్న కలలు నెరవేరకపోవటం నా బ్యాడ్‌లక్! పైన 'గాడ్‌ఫాదరెవరూ లేకపోవటంతో రిటెన్ ఎగ్జామ్ పాసైనా ఇంటర్వ్యూలో తన్నింది.

అంచేత ఎస్సైపోస్టునే కౌగలించుకోక తప్పలేదు. నా ఒక్కగానొక్క వంశాకురాన్ని మాత్రం పోలీసు వాతావరణానికి దూరంగా వుంచి పెంచాలనేది నా ఆశయం. కంప్యూటర్ ఇంజనీర్‌ను చేసి అమెరికా తరిమేయాలనేదినా చిరకాల వాంఛ!

నా అభిమతాన్ని కాదని... నా ఆలోచనకు విరుద్ధంగ... నా కొడుకు మధు డిగ్రీ మూడుసార్లు డింకీ కొట్టి చివరికి ఎలాగో ఒక్కో సబ్జక్టు ఒక్కోసారి పాసై ఇక చదివేది లేదని మొండికెత్తేడు. నా ఆలోచనల్నీ తలకిందులైనయ్!. ఆశలు అడియాశలైనయ్. నా కడుపున ఇలాంటి పండిత పుత్రుడు పుట్టినందుకు బాధపడ్డాను.

× × × × ×

ఒకరోజున మధు యూనిఫారంలో ఇంట్లోకి రావటం చూచి నివ్వెరపోయాను.

'ఇదేం బుడబుక్కల వేషంరా మధూ?- ఏదైనా డ్రామాలో పోలీసు వేషం

వేస్తూ నాకు చూపించాలని ముచ్చటపడి డ్రెస్‌లో ఇంటికొచ్చావా?-' కాఫీ సిప్ చేస్తూ అడిగాను.

'అదేం కాదు. అలా ఎగతాళి చేయకండి! మనవాడికి పోలీసు కానిస్టేబుల్ వుద్యోగం వచ్చేసింది...' పక్కన వున్న శ్రీమతి బదులిచ్చింది.

నాకు సడన్‌గా హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైంది.

'నీకిదేం పెడబుద్ధిరా మధూ!... పోయి పోయి ట్రాఫిక్ కానిస్టేబుల్ జాబ్ చేస్తావా?- అయినా ఈ విషయం ముందుగా నాకెందుకు చెప్పలేదు?-' నొసలు చిట్లించాను.

'నన్ను మీరు మీ డిపార్ట్‌మెంట్‌లో చేరటానికి వీల్లేదని శాసించారు కదా?- మీకు ముందుగా చెప్తే సెలక్షన్స్‌కు వెళ్లనివ్వరని చెప్పలేదు- సెలక్షనొచ్చి... ఇంటర్వ్యూలో నెగ్గి... అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికి తీసుకుని మొన్ననే డ్యూటీలో కూడా జాయినైపోయాను...' పళ్లికిలించాడు మధు.

'నేను డిఎస్పీగా చేస్తుండగ... నువ్వు పోలీసా?.. అందునా ట్రాఫిక్ పోలీసు వుద్యోగం చేయటమా?- సిగ్గుగా లేదూ...'

'ఉద్యోగం పురుష లక్షణం డాడీ!- మన పోలీసు వంశాచారం క్రమం తప్పకుండా పాటించాను... కదూ?-'

'నోర్మూయ్యరా!- నలుగురిలో నన్ను తలెత్తుకోనీయకుండా చేశావ్... ట్రాఫిక్ పోలీసు వుద్యోగమంటే కత్తిమీద సామేరా!- ఎర్రటి ఎండలో దుమ్ములో... ధూళిలో... వర్షంలో నిలువు కాళ్ల వుద్యోగం చేయాలి!... నానా అవస్థలూ పడాల్సి వస్తుంది... కోపం... విసుగు తారాస్థాయికి చేరింది.

'నేను ఎప్పటికైనా ఎస్సై అవుతాను డాడీ...'

'ఛ! నోర్మూయ్. చేసిన ఘనకార్యం చాలక ఇంకా వాగుతున్నావా?-'

ఇంకా అక్కడే నిలబడి వుంటే మాటలతో రాచిరంపానపెడతాడేమో డాడీ అన్పించి తనగదిలోకి వడివడిగ నడిచాడు మధు.

× × × × ×

నేను జాబ్‌లో జాయినైన కొత్తల్లో అంటే ప్రబేషనైనా డిక్లేర్ కాకముందే... పేరున్న లాడ్జిలో వ్యభిచారం జరుగుతున్నదనే రహస్య సమాచారం రావటంతో నలుగురు కానిస్టేబుల్స్‌ని వెంట తీసుకుని రైడింగ్‌కి జీపులో బయల్దేరాను.

చకచకాగా గదులన్నీ గాలించాం! ఆ లాడ్జి ఎం.ఎల్.ఏ గారి బావమరిదని నాకు తెలీదు. నా కానిస్టేబుల్స్ చెప్పక పోవటాన రైడింగ్ చేసి రెండు గదుల్లో వున్న నలుగురు ఆడవాళ్లను ముగ్గురు మగవాళ్లని కస్టడీలోకి తీసుకొచ్చి లాకప్‌లో వేసి మీసం దువ్వాను ఘనకార్యం చేసినందుకు.

పదినిముషాలైనా కాకముందే మినిస్టర్ గారి పి.ఏ నుండి ఫోన్ కాలొచ్చింది. అతిథి మర్యాదలతో లాకప్‌లో వేసిన వారిని విడిచిపెట్టలేక తప్పలేదు.

నాసిన్సియారిటికి మెప్పు కాకపోగా తెల్లారి -డ్యూటీకెళ్లగానే నా టేబుల్ మీదున్న సీల్డు కవర్ ఓపెన్ చేసి నిర్ఘాంతపోయాను.

మినిస్టర్ గారి తాలూకూ మనుష్యులను అరెస్ట్ చేసి లాకప్‌లో వుంచినందుకు కవర్లో ఉన్న సస్పెన్షన్ ఆర్డర్ నన్ను చూచి వెక్కిరించటం.. నే సహించలేకపోయాను.

వాళ్ల కాళ్లు వీళ్ల కాళ్లు పట్టుకోగా ఆరు నెలల సస్పెన్షన్ ఆర్డర్ 'రివోక్' అయింది. బ్రతుకుజీవుడా అనుకున్నాను. చావు తప్పి కన్నులొట్టపోయినంత పనైంది.

అది సుత.... లాఠీఛార్జ్... అరెస్టు... లాకప్‌లో వెయ్యటమంటేనే భయం పట్టుకుంది. గుండె దడ దడ కొట్టుకునేది. 'నువ్వు చిన్నవాడివి కావటాన నీకే విషయం తెలీదురా మధు... ఎందుకురా పోలీసు వుద్యోగంలో చేరావు...' వేదనతో నాలో నేను గొణుక్కున్నాను కొడుకు నిర్వాకానికి.

నా సస్పెన్షన్ లిఫ్ట్ చేసి నన్ను శ్రీకాకుళంలో మారుమూల ప్రదేశానికి పోస్టింగ్ ఇచ్చారు. అదంతా దట్టమైన అటవీ ప్రాంతం కావటాన... నక్సల్స్ ప్రభావిత ప్రాంతమనీ తెలీటాన ఫ్యామిలీ షిఫ్ట్ చేయటానికి మనస్కరించక... ఫ్యామిలీని సిటీలోనే వుంచి నేనొక్కడినే అక్కడికి వెళ్లి రిపోర్ట్ చేయవలసిన పరిస్థితి నెలకొంది.

ప్రాణాలు అరచేత పెట్టుకుని డ్యూటీ చేయాల్సి వచ్చింది. ఎక్కడ ఏమందు పాతరవుందో... ఎప్పుడు పోలీసు స్టేషన్‌పై దాడి జరుగుతుందోననే భయం వెంటాడసాగింది.

దేవుడి అనుగ్రహం వల్ల నాకెలాంటి అపాయం జరుగకనే, మూడేళ్ల కాలం ముగిసినందుకు సంతోషించాను.- నా అప్లికేషన్ కన్సిడర్ చేసి పెద్ద దొర వారు నన్ను మళ్లీ సిటీకి బదిలీ చేసి పుణ్యం కట్టుకున్నందుకు వేంకటేశ్వర స్వామి కొండకెళ్లి తలనీలాలు సమర్పించుకుని తృప్తి పడ్డాను.

డిపార్ట్‌మెంట్లో డ్యూటీ నిర్వహించాలంటే ఎలాంటి సాధక బాధకాలుంటాయో... పసివాడు... కొత్తగా చేరిన మధుకేం తెలుస్తుంది?

'మీరు అనవసరంగ దిగులు పడి మనసు పాడు చేసుకోకండి! మనబ్బాయి దర్జాగా డ్యూటీ చేస్తాడు' ధైర్యం చెప్పింది శ్రీమతి.

× × × × ×

ప్రజలు కూడా తెలివి మీరటంతో ఆశించిన విధంగాపైడబ్బులు గిట్టు బాటు కావటం లేదని గ్రహించాడు మధు. రోజుకు వేలకు వేలు సంపాదించచ్చని ఎన్నో తీపి కలలు కన్నాడు. తీరా డ్యూటీ చేయటం మొదలయ్యాక కలలన్నీ కల్లలే అయినయ్. రోజుకు ఐదో పదో రావటం కష్టమవుతోంది.

ఇందుకా... ఇంత స్వల్ప ఆదాయం కోసమేనా నీవుద్యోగంలో చేరింది?- నో!... ఎట్లాగైనా సరే ఏడాది తిరక్కముందే లక్షలు ఆర్జించాలి! లేకుంటే తానీ వుద్యోగం చేయటం వృథా! నిరాశ పదేపదే నిరుత్సాహ పరుస్తోంది మనసును! ఆలోచనలు వడివడిగా అనేక రకాల మార్గాలు అన్వేషిస్తున్నయ్.

రాసిన కేసుల తాలూకు డబ్బంతా చలాన్ల రూపంలో ప్రభుత్వ ఖజానాలోకి పోవటం చూస్తూ మధు మనసు విలవిల్లాడుతోంది.

తను ఏదో ఒకటి చెయ్యాలి! తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు ఆర్జించాలనే తన ధ్యేయం! నాలుగేళ్ళలో కోటీశ్వరుడవాలి అంటే... తానేం చేయటం! మార్గాన్వేషణలో వడ్డాడు మధు.

ఒకరోజు మెరుపు లాంటి ఆలోచన విద్యుల్ల తలా మదిలో తళుక్కున మెరిసింది! ఈ వ్యవహారం రెండో కంటికి తెలీకుండా నిర్వహించాలి! అప్పుడు గాని ఆశించిన ప్రయోజనం చేకూరి తాను కోటీశ్వరుడు కాలేడు.

× × × × ×

ఎందరు దొంగనోట్లు ముద్రించి చెలామణీ చేయటం లేదు?... ఎందరు డూప్లికేట్ యూనివర్సిటి డిగ్రీలు ముద్రించి బోలెడు డబ్బు ఆర్జించటం లేదు? స్టాంపుల కేసులో తెల్గీ ఎన్ని కోట్లు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి దండుకోలేదు?... పది మందికి పంచిపెట్టి తాను తగినంత స్వాహా చేశాడు. ఇందిరా వికాస పత్రాలు ముద్రించి కోటానుకోట్ల దిగమింగిన వుదంతం వుండనే వుంది.

పాస్‌పోర్ట్‌ల దగ్గర్నుంచీ అన్నీ డూప్లికేట్లే! ధైర్యం చేసి బాగుపడే వాళ్ళ

గొప్పోళ్ళవుతూనే వున్నారు. ఖర్మగాలి పట్టుబడితే పెద్దలు వుండనే వున్నారు ఆదుకోవటానికి?-

కానీ... తనకెవరున్నారు? వెధవ పని చేస్తే తననెవరు ఆదుకుని సాయం చేస్తారు? పట్టుబడితే జైలు శిక్ష తప్పదు. ఇట్లా మీనమేషాలు లెక్కిస్తూ కాలయాపన చేస్తుంటే ప్రయోజనం శూన్యం!

దేనికైనా ధైర్యం చేయాలి! మనో నిబ్బరం వుండాలి!- తెగింపే రాచమార్గమౌతుంది.

అనేక విధాలుగా మధు ఆలోచిస్తున్నాడు. ఇలాంటి వెధవపన్లు చేయటానికి ఒక్కడుచాలడు. టీమ్‌లో అరడజనుమందైనా వుండాలి!- ప్లాన్ సక్సెస్ అయితే సంఖ్య పెరుగుతుంది. అందరూ బాగుపడచ్చు!

తన ఆలోచన ఇంట్లో తెలియనీయ కూడదనకున్నాడు మధు.

ఏడాది గిర్రున తిరిగొచ్చింది. మధును అదృష్టం వరించింది. యాభైలక్షల తన వాటా కింద వెనకోసుకోగలిగాడు తాను ముద్రించిన డూప్లికేట్ దొంగ చలాన్ పుస్తకాల ద్వారా తోటి వారూ బాగుపడ్డారు!

× × × × ×

చెలాన్ల తాలూకు సొమ్ము ఊహకు అందని విధంగా తగ్గిపోవటం గమనించిన పోలీసు అధికార వర్గాలు ఎందుకిలా జరిగిందో? ఆదాయం పడిపోవటానికి గల కారణాలు విశ్లేషించసాగారు.

జంటనగరాల్లోనే కాదు... జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొనటం అధికారులను కలవరపరిచింది.

అత్యంతగోప్యంగ... ఎవరికీ తెలియనంత రహస్యంగా ఎంక్వయిరీ అన్ని లెవల్స్‌లోనూ ప్రారంభించారు. తీగలాగే సరికి డొంకంత కదిలింది!

పెద్ద స్థాయిలో ఫ్రాడ్ జరుగుతున్నదనే రహస్యాన్ని ఛేదించింది ఎంక్వయిరీ కమిటీ! రెడ్‌హేండెడ్‌గా డూప్లికేట్ చలాన్‌పుస్తకాలను దొరికినంత వరకు కాన్ఫిసికేట్ చేసి కొందరి ట్రాఫిక్ కానిస్టేబుళ్లను కస్టడీలోకి తీసుకున్నారు.

డూప్లికేట్ చలాన్ పుస్తకాల ప్రచురణ కర్త కానిస్టేబుల్ మధు అని అధికారులు నిర్ధారించుకుని మధుని అరెస్ట్ చేయటానికి రహస్యంగా సన్నాహాలు పూర్తి చేశారు.

ఒకరోజు ఉదయం వేళ కాఫీ తాగుతూ న్యూస్ పేపర్ తిరగేస్తున్న సమయంలో మా ఇంటి ముందు రెండు పోలీసు జీపులు ఆగటం... అందులోంచి ఎస్పీ... ఎ.సి.పి... డి.సి.పీలు దిగి ఇంట్లోకి రావటం గమనించిన నాకు గుండె ఝల్లుమంది. ఏదో కొంప మునిగివుండి వుంటుంది. అంచేతనే ఇందరు అధికారులు కట్టకట్టుకు మరీ ఇంటికొచ్చారనుకుంటూ... చేతిలో కప్పు టీపాయ్ మీదుంచి లేచి నిలబడి అధికారులకు సెల్యూట్ చేశాను.

నాకేసి నిశితంగా చూస్తూ 'నీ కొడుకు మధు ఇంట్లో వున్నాడా?...' లోపలికొచ్చి ముక్తకంఠంతో ప్రశ్నించారు.

నాకు నిలువు గుడ్లుపడ్డయ్! విస్తుపాటు నోట మాటరాలేదు.

'లేదు సార్. నాలుగు రోజులైంది వాడు ఇంటికొచ్చి... ఏం జరిగింది సార్...?' వణికే స్వరంతో అందరి ముఖాల్లోకి చూస్తూ అడిగాను.

'నీ కొడుకు పెద్ద ఫ్రాడ్! ప్రభుత్వాన్ని డిపార్ట్‌మెంట్‌నే మోసం చేసిన ద్రోహి... వాడిని అరెస్ట్ చేయటానికి వారెంట్‌తో వచ్చాం....' ఎ.సి.పి కటువుగా మాట్లాడేడు.

నా పల్స్ పడిపోయినట్టు... హార్ట్ బీట్ ఆగినట్టయింది.

'ఎక్కడికి పోతాడు రాస్కెల్?... ముల్లోకాల్లో ఎక్కడున్నా వెతికి పట్టుకుంటాం...' విసవిసా నడుచుకుంటూ వెనుదిరిగారు ముగ్గురు.

అసలేం జరిగిందో? కొడుకునెందుకు అరెస్ట్ చేయాలని వచ్చారో బోధపడక జుట్టు పీక్కున్నాను.

నాపక్క నేవున్న శ్రీమతి లబోదిబో మంది!

తాను చేసే ఛీటింగ్ వ్యవహారం బైటపడ్డదని వాసన పట్టిన మధు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయాడు. ఈ విషయం కన్న వారి క్కూడా తెలియదు. కోట్ల రూపాయలకు పైగా చెలాన్ల ద్వారా దండుకున్న డబ్బు భవిష్యత్ అవసరాలకు జాగ్రత్త చేసుకున్నాడు మధు

(సమాప్తం)